# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# యువతా.. ఇదే ఇందిరమ్మ రాజ్యం



రచ్చ దినేష్
89787 40475

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ చెప్పిన మాటలు ఇప్పుడు పదేపదే గుర్తుకొస్తున్నాయి. కాంగ్రెస్ తత్వమేమిటో కేసీఆర్‌కు తెలిసినంతగా మరెవరికి తెలుసు! అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రాబోయే అనర్థాలేంటో కండ్లకు కట్టినట్టు చెప్పారాయన. కరెంట్ కష్టాలు, దళారుల రాజ్యం, కబ్జాలు, అల్లర్లు, మోసాలు, జర్నలిస్టులపై దాడులు, నయవంచన తప్పవని కేసీఆర్ ముందే హెచ్చరించారు. ఆయన మాటలకు దృశ్య రూపమే తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న వరుస ఘటనలు.

కాంగ్రెస్ గురించి బాగా తెలిసినవాళ్లు కూడా కేసీఆర్ మాటలు నిజం కావటానికి దాదాపు రెండేండ్లు పట్టొచ్చని భావించారు. కానీ, వాళ్ల అంచనాలను తలకిందులు చేస్తూ వంద రోజుల్లోనే భవిష్యత్తు తెలంగాణ ఎలా ఉండబోతుందో ట్రైలర్ రూపంలో చూపిస్తున్నారు కాంగ్రెస్ పాలకులు. అసలు పిక్చర్ ఇంకా బాకీ ఉంది. కాలం మారింది, కాంగ్రెస్ కూడా మారి ఉంటుందని భావించి ఓటు వేసిన వాళ్లందరికీ చుక్కలు చూపిస్తున్నది కాంగ్రెస్ సర్కార్. ట్రైలరే ఇంత వైలెంట్‌గా ఉంటే అసలు సినిమా ఎలా ఉంటుందోనని ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుడుతున్నది.

తెలంగాణ ప్రజల అదృష్టం బాగుంది. అందుకే రాష్ట్రం ఏర్పాటు తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. ఒకవేళ అదే జరిగి ఉంటే అప్పట్లో తెలంగాణ విఫల ప్రయోగమని చెప్పిన వాళ్ల మాటలన్నీ నిజం చేసేవారు కాంగ్రెస్ నేతలు. తెలంగాణవాళ్లకు పాలన చేతకాదని చెప్పి.. మళ్లీ మనతోనే ఆంధ్రాలో కలిపేయాలని ఉద్యమం చేయించేవారు. కానీ, కేసీఆర్ వాళ్లకు ఆ అవకాశం ఇవ్వలేదు. దృఢ సంకల్పంతో స్వరాష్ట్రం కోసం జరిగిన ఉద్యమాన్ని మించి.. తెలంగాణను నిలబెట్టేందుకు కష్టపడ్డారు కేసీఆర్. ప్రాంతం మీద ప్రేమ ఉన్నవాడు పాలకుడైతే ఎంతగా అభివృద్ధి చేయవచ్చు అనేది చేసి చూపించారు. శతాబ్ద కాలం పాటు కష్టపడితే జరిగే అభివృద్ధిని దశాబ్దంలోనే సాధించారు.



గతంలో అన్యాయం జరిగిందనే కదా తెలంగాణ తెచ్చుకుందని తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో చిలుకపలుకులు పలికారు. ప్రజలు కూడా వాళ్ల మాటలను నమ్మారు. మరి ఇప్పుడు ఏం జరుగుతున్నది. పాలన ఎలా చేయాలో కేసీఆర్ చక్కగా చేసి చూపించారు. అయినప్పటికీ కాంగ్రెస్ నేతలు ఆ తోవలో నడవటం లేదు. పచ్చని తెలంగాణలో ఆత్మహత్యలు, దాడులు, నీటి కష్టాలు, సాగు కష్టాలు ఎందుకు మొదలయ్యాయి? ప్రశ్నించే జర్నలిస్టులపై భౌతికదాడులు, బూతు కామెంట్లు, చెప్పుతో కొడుతామంటూ బెదిరింపులు దేనికి సంకేతం. పదేండ్లలో లేని బాధలు ఇప్పుడే ఎందుకు కనిపిస్తున్నాయి? ప్రజలంతా రోడ్లమీదికి రావాల్సిన దుస్థితి ఎందుకొచ్చింది? రైతులు మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్లను రిపేర్లు చేయించుకోవాల్సిన దురావస్థ ఎందుకు వచ్చింది? ఇన్నేండ్లు లేని కృష్ణా రివర్ బోర్డు పంచాయితీ ఇప్పుడే ఎందుకు ముందుకొచ్చింది? వందరోజుల్లోనే అందరికీ కేసీఆర్ ఎందుకు గుర్తొస్తున్నారు?

ఫోజులు కొట్టుడు వేరు. పనులు చేసుడు వేరు. ప్రజలకు మంచి చేస్తేనే మరో చాన్స్ ఇస్తారని గ్యారెంటీ లేదు. కానీ, అధిష్ఠానాన్ని మెప్పిస్తే ఏదో ఒక పదవి మాత్రం గ్యారెంటీ. కాంగ్రెస్ నాయకులకు మొదటి నుంచి పదవి కాపాడుకోవడంపైనే ధ్యాస ఉండేది. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే సోయి కాంగ్రెస్ నేతలకు ఎందుకుంటది? కాంగ్రెస్ పాలిత మిగతా రాష్ట్రాల్లో ఎట్ల పరిపాలన జరుగుతున్నదో అట్లనే మమ అనిపిస్తే చాలు అన్నట్టు ఉంది వారి వైఖరి.

రాష్ట్రాన్ని పాలించడం.. కేసీఆర్‌ను తిట్టినంత సులభం కాదని ఇప్పుడు కాంగ్రెస్ నేతలకు తెలిసివస్తున్నది. తిట్లు, బూటకపు హామీలతో ఎక్కువ కాలం వెళ్లదీయలేమని వారికి అర్థమవుతున్నది. ప్రశ్నించిన వారిపై దాడులకు దిగటానికి కూడా కొందరు ఏమాత్రం జంకటం లేదు. కానీ, ప్రశ్నల పేరుతో ఇష్టమొచ్చినట్టుగా మాటలతో దాడులు చేసినా వాటిని 'డోంట్ కేర్' అంటూ పాలన సాగించారు కేసీఆర్. కొత్త రాష్ట్రాన్ని గాడిలో పెట్టారు. అందుకే ఇప్పుడు కేసీఆర్ విలువ అందరికన్నా ఎక్కువగా 'సీఎం రేవంత్‌రెడ్డి అండ్ కో'కే తెలుస్తున్నది.

తెలంగాణ యువత ఇందిరమ్మ పేరును విన్నారే గానీ, ఆమె పాలనను కండ్లారా చూడలేదు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని కాంగ్రెస్ పదేపదే చెప్తే ఎంత అద్భుతంగా ఉంటుందోనని వారంతా భావించారు. అయితే ఆనాటి పరిస్థితులను కండ్లకు కట్టినట్టు కాంగ్రెస్ నేతలు ఇప్పుడు చూపిస్తున్నారు. వారి పాలనను చూసి తెలంగాణకు కాంగ్రెస్ పట్టింది.. పీడదినాలు మొదలయ్యాయని అందరూ ఆవేదన చెందుతున్నారు. ఈ రెండున్నర నెలల పాలన చూశాక తెలంగాణకు కావాల్సింది ఇందిరమ్మ రాజ్యం కాదు, కేసీఆర్ రాజ్యమని ప్రజలకు స్పష్టంగా అర్థమైంది.

# బీఆర్‌ఎస్ కృషి ఫలం.. భారతరత్నతో సఫలం

'It's never too late to be what you might have been'.

ప్రఖ్యాత ఆంగ్ల రచయిత్రి జార్జి ఇలియట్ అన్న ఈ మాటలు పీవీ నరసింహారావు జీవితానికి సదా అనువర్తితాలు. జార్జి ఇలియట్ సామాన్య రచయిత్రి కాదు. 18వ శతాబ్దం ఉత్తరార్థం ఆంగ్ల సాహిత్యంలో అన్ని ప్రక్రియలలోనూ ఆరితేరిన విదుషీమణి. అంతే కాదు, స్త్రీవాద ఉద్యమానికి స్ఫూర్తినందించిన వారిలో ఒకరు. అన్నిటిని మించి సాహిత్యంలో, సమాజంలో సంస్కరణలను ఆశించిన అభ్యుదయ శీలి. 'ఆలస్యం అమృతం విషం' అన్న సూక్తి ఒక్కోసారి నిజం కాదనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో ఆలస్యమైనా మేలే జరుగుతుందని భావించాలి.

నిదానమే ప్రధానం అని భావించి, మతితప్పిన కాకుల రొదలో మౌనమే ఆయుధంగా ధరించి, చిక్కని చీకటిలో కేవలం చుక్కల వెలుగులోనే సాగుతూ.. మనదేశ ప్రధానిగా పీవీ సాధించిన విజయాలు అపూర్వమైనవి. ఆయనకు ముందున్న ప్రధానులు సంక్షేమంపైనే దృష్టి పెట్టారు. సంస్కరణలను పట్టించుకోలేదు. దేశ ప్రగతికి సంస్కరణలే ప్రధానమని విశ్వసించి త్రికరణశుద్ధిగా అమలు చేసి చూపించిన మేధావి పీవీ. ఆయన అమలు చేసిన సంస్కరణలన్నీ ప్రతికూల పరిస్థితుల్లోనే కావడం గమనించదగ్గ విషయం.





డాక్టర్ వి.వి.రామారావు
98492 37663

పీవీ భూసంస్కరణలు.. ఒక ప్రత్యేక అధ్యయనం. 1971 సెప్టెంబర్ 30వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పీవీ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత ఆరు నెలలకు 1972 మార్చిలో శాసనసభ ఎన్నికలలో పీవీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సాధించగా.. ఆయన 1972 మార్చి 20న మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. నిజానికి పీవీ కన్నా ముందే ఆయన గురువు బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా జాగీర్దారి విధానం రద్దుచేశారు. భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశపెట్టి కౌలుదార్లకు యాజమాన్యపు హక్కును కల్పించారు.

సంఘ సంస్కరణోద్యమ పితామహుడైన రాజా రామ్మోహనరాయ్ మొదలుకొని ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రానడే, గోఖలే, జ్యోతిరావు పులే, స్వామి వివేకానంద, తిలక్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, డా.బీఆర్ అంబేద్కర్, గాంధీజీ వంటి మహనీయుల సంస్కరణ ఉద్యమాలతో పీవీ ప్రభావితుడయ్యారు. ఆనాటి సంస్కరణలు సంస్కృతి పరమైనవి కావచ్చు, సమాజపరమైనవి కావచ్చు, కుల, మతపరమైనవి కావచ్చు.. గానీ, నిద్రాణమైన జాతిని సముద్ధరించే దిశగా ఆయన తీసుకొచ్చిన మార్పులు ఎంతో విశిష్టమైనవి. కొన్ని కాలపరీక్షకు నిలబడినవి ఉంటాయి. పీవీ సహజంగానే సంస్కరణశీలి. ఆయన సంస్కరణలు కేవలం భూ, ఆర్థిక పరమైనవే కావు. సాంస్కృతిక విలువల గురించి తపన ఆయన సాహితీ సృజనలో కూడా ప్రతిఫలించింది. పీవీ నరసింహారావు స్వాతంత్ర్యోద్యమ కాలంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. నేతాజీ, గాంధీ, నెహ్రూ, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణరావు మొదలైన మహనీయుల నాయకత్వ విధానాన్ని పీవీ ఎరిగినవారే. పైగా ఇంటర్ మొదలు న్యాయశాస్త్రం వరకు మహారాష్ట్రలో చదవడం మూలంగా ఆయనపై మహారాష్ట్ర సంస్కృతి ప్రభావం కూడా చాలా ఉన్నది. హరి నారాయణ ఆప్టే మరాఠీలో రాసిన పణ్ లక్ష్యాత్ కోణ్ ఘేతో (ఆమెను ఎవరు పట్టించుకుంటారు) నవల మొత్తం వితంతు, స్త్రీ విద్యకు సంబంధించినదే. పీవీ ఈ నవలను 'అబలా జీవితం' పేరిట తెలుగులో అనువదించారు. ఇది సాంఘిక నవలే అయినప్పటికీ ఇతివృత్తమంతా సంస్కరణ నేపథ్యంగానే ఉంటుంది.

విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' నవల ప్రధానంగా ప్రాచీన గ్రామ సువ్యవస్థను విధ్వంసం చేసిన పాశ్చాత్య నాగరికత గురించే. లుప్తమైపోతున్న మన భారతీయ సంస్కృతి విలువల పట్ల తాత్విక విచారధారతో, తార్కికంగా విమర్శిస్తూ వేయిపుటల వచనకావ్యంగా మలచిన ఈ రచన ఒక విధంగా విశ్వనాథవారి 'ఇన్ సైడర్' అని పేర్కొనవచ్చు. పీవీ ఇన్‌సైడర్‌లో ఆనంద్ వలె.. వేయిపడగలు నవలలో ధర్మారావు కనిపిస్తారు.

విశ్వనాథ భావజాలాన్ని తొలుత విమర్శించి, తర్వాత అంగీకరించి వేయిపడగలు నవలను 'సహస్ర ఫణ్' శీర్షికతో అనువదించి హిందీ సాహిత్యాభిమానులకు సైతం పీవీ తన సాంస్కృతిక సంస్కరణల ఉద్దేశాన్ని పరోక్షంగా ధ్వనించారు. సహస్ర ఫణ్ చదివాక.. ఎంతో పులకించి పీవీ రచనే మూలమని, తన రచనే అనువాదమని అనుకొనే విధంగా ఉన్నదని విశ్వనాథ ప్రశంసించడం విశేషం.

పీవీ ఇన్‌సైడర్ నవల సైతం క్షీణించిపోతున్న రాజకీయ విలువల గురించి చర్చిస్తూ.. భూ సంస్కరణల గురించి వివరించింది. ఇలా పీవీలోని సంస్కరణలు ఆయన సాహిత్యం ద్వారా ప్రతిఫలించాయి. సమాజ శ్రేయస్సు కోసం రచయిత అయినా, రాజకీయ నేత అయినా ఎలాంటి స్పష్టత కలిగి ఉండాలో ఆయన స్వయంగా ఆచరించి చూపారు.

పీవీ రాజకీయ జీవితం కంటే ముందే (1948-52) కాకతీయ వార పత్రికను స్థాపించి, పాత్రికేయ వృత్తిలో భాగంగా సమాంతరంగా సాహిత్యాన్ని చేపట్టారు. గొల్ల రామవ్వ వంటి కథలు అలా వెలువడినవే! సమాజాన్ని తమ కలం ద్వారా స్కాన్ చేసే పత్రికా ప్రతినిధులు కూడా సంస్కరణ శీలురే అని ఆయన భావన. అందుకే స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సంఘ సంస్కరణల్లో చాలా మంది తమ సొంత గొంతు కోసం పత్రికను స్థాపించారని ఒకానొక సందర్భంలో పీవీ వివరించారు.

1957లో పీవీ తొలిసారి మంథని నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. అయితే పదవి వచ్చేంత వరకే ఆయన ప్రశాంత గోదావరి. ఆ తర్వాత ఆయన వరద గోదావరి. తొలిసారి 1962లో ఆయన నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో న్యాయ, జైళ్లు, సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ మంత్రి అయ్యారు. ఇంకేముంది.. వెంటనే తన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. విదేశాలలో జైళ్లను అధ్యయనం చేసి అధికారులతో చర్చించి హైదరాబాద్‌లో తొలిసారి మూడు రోజుల పాటు బహిరంగ సదస్సు నిర్వహించారు. రాజకీయ, సామాజిక, విద్యా రంగాలకు సంబంధించిన అందరినీ ఆ సదస్సుకు ఆహ్వానించారు. జైళ్ల సంస్కరణల గురించి చర్చించారు. ఫలితంగా జైళ్లలో గ్రంథాలయాలు, కల్చరల్ సెంటర్లు ఏర్పాటు చేయించి జైళ్లంటే పరివర్తన మందిరాలనే భావన కలిగించారు. మనం సినిమాల్లో చూస్తుంటాం.. నేరస్థుడు జైలు నుంచి విడుదల కాగానే మళ్లీ తన పాత పగను సాధించడానికి వెళ్లినట్లు. పీవీ దాన్ని దృష్టిలో ఉంచుకున్నారేమో.. 1965లో అనంతపురంలో 1,600 ఎకరాల ఓపెన్ జైలు ఏర్పాటు చేయించారు. నేరస్థుల విడుదలకు ముందే సత్ప్రవర్తన ఉన్నవారిని ఇందులోకి పంపి వ్యవసాయం, తోట పనులు చేయించి తర్వాత విడుదల చేస్తారు. ఏలూరు, హైదరాబాద్‌లో జైళ్లల్లో జూనియర్ సర్టిఫికెట్ కోర్సు స్కూలు పెట్టించారు బాల, మహిళా నేరస్థుల కోసం. 1964లో కాసు సీఎం అయ్యారు. ఆయన పీవీని బృహస్పతి అనేవారు. ఆయన మంత్రివర్గంలో దేవాదాయ, ధర్మాదాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఆ శాఖలో ఎన్నో మార్పులు తెచ్చారు పీవీ. 1967లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అయ్యారు. డైరెక్టర్ ఆఫ్ మెడిసిన్ అండ్ హెల్త్ అనేదాన్ని పీవీ కొత్తగా ఏర్పాటు చేశారు. డాక్టర్ల ప్రైవేటు ప్రాక్టీసు నిషేధించారు. 1968లో విద్యాశాఖ మంత్రి అయ్యారు. డిగ్రీ వరకు తెలుగు మీడియం బోధనా భాషగా చేశారు. తెలుగు అకాడమీ స్థాపించి ఆయనే చైర్మన్‌గా వ్యవహరించారు. డిటెన్షన్ విధానం రద్దు చేశారు. మెడికల్ కాలేజీలో ప్రవేశాలకు ఎంట్రెన్స్ పెట్టించారు. అధికార భాషా సంఘం ఏర్పరిచారు.

పీవీ భూసంస్కరణలు.. ఒక ప్రత్యేక అధ్యయనం. 1971 సెప్టెంబర్ 30వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు పీవీ ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత ఆరు నెలలకు 1972 మార్చిలో శాసనసభ ఎన్నికలలో పీవీ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సాధించగా.. ఆయన 1972 మార్చి 20న మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు.

నిజానికి పీవీ కన్నా ముందే ఆయన గురువు బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా జాగీర్దారి విధానం రద్దుచేశారు. భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశపెట్టి కౌలుదార్లకు యాజమాన్యపు హక్కును కల్పించారు. 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించాక నీలం సంజీవరెడ్డి, సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి భూసంస్కరణల వంటి ప్రగతిశీల చట్టాల జోలికి పోలేదు. 1972లో సంస్కరణల గురించి, కేంద్ర సంఘం చేసిన సిఫారసుల గురించి పీవీ ఆలోచించారు. ముందే శాసనసభలో చర్చిస్తే భూస్వాములు 'జాగ్రత్త' పడతారని, 1972 మే 2న గవర్నర్‌తో అకస్మాత్తుగా ఆర్డినెన్సు జారీ చేయించారు. దాంతో ఎక్కువ భూములున్న వారి క్రయవిక్రయాలు ఆగిపోయాయి. భూకమతాలపై గరిష్ఠ పరిమితి విధింపు ఎవరినో నష్టపరచాలనో, కక్ష సాధించాలనో కాదు.. నవ సమాజ నిర్మాణానికి ఈ చర్య అవసరం అని ఆయన ప్రకటించారు. తనను తాను విప్లవ తపస్విగా అభివర్ణించుకొన్నారు. ఇక కేంద్రంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పీవీ సంస్కరణలు తెచ్చారు. నూతన జాతీయ విద్యావిధానం రూపొందించారు. గ్రామీణ విద్యార్థుల కోసం జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేశారు. 1991లో రాజీవ్‌గాంధీ దుర్మరణం అనంతరం క్లిష్ట పరిస్థితులలో ప్రధానమంత్రి పదవిని పీవీ చేపట్టారు. తన హయాంలో ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సైతం ప్రత్యేక అధ్యయనం చేయాల్సిన అంశమే. స్థూలంగా చెప్పాలంటే, రూపాయి మార్పిడి రేటు సర్దుబాటు, వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక విధానాలలో మార్పుల వలన దేశ ఆర్థిక స్థితి తిరిగి గాడిలో పడింది. పీవీ న్యూడీల్ విధానాన్ని ప్రవేశపెట్టి 'ఇండియన్ రూజ్‌వెల్ట్' అని అనిపించుకున్నారు.

అయోధ్యలో వివాదానికి పీవీ ఎంతమాత్రం కారణం కాదు. ఆయనకు ముందు ప్రధానులుగా ఉన్న రాజీవ్ గాంధీ, వీపీ సింగ్ అనుసరించిన చర్యలే దానికి కారణం. 1986లో రాజీవ్ ప్రధానిగా ఉన్నప్పుడే రామజన్మభూమి ప్రాంగణం గేట్లు తెరిచారు. 1989లోనే కాంగ్రెస్ ప్రభుత్వం శిలాన్యాస్‌కు అనుమతినిచ్చింది. అయోధ్యలో పూర్తి భూమిని రామ మందిరానికే కేటాయిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో వివాదాస్పద భూసేకరణకు పీవీ నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయమే ఇప్పుడు నరేంద్రమోదీ ప్రభుత్వానికి లాభించింది.

అద్వానీ, జోషిలా కాకుండా పీవీని మోదీ పల్లెత్తు మాట అనలేదు. పైగా పీవీకి తగిన గుర్తింపు ఇవ్వలేదని 2014 నిజామాబాద్ సభలో సోనియా గాంధీ కుటుంబాన్ని మోదీ విమర్శించారు. తదుపరి కేసీఆర్ ప్రభుత్వం 2020లో పీవీ శతజయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించి అసెంబ్లీలో భారతరత్న కోసం తీర్మానం చేసింది. కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో పీవీ మరోసారి తెరపైకి వచ్చారు. తెలంగాణ వ్యాప్తంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని స్వచ్ఛంద సంస్థలు పీవీని ఆర్థిక సంస్కరణల పితామహునిగా ప్రశంసించడం ప్రారంభించాయి. విదేశాలలో సైతం పీవీ అభిమానులు జూమ్‌లో సెమినార్లు నిర్వహించారు. 2021 సంవత్సరానికల్లా పీవీ భారతరత్నకు అర్హుడనే భావన ప్రపంచవ్యాప్తంగా కలిగింది. ఇందుకు కేసీఆర్‌కు తెలుగుజాతి తొలుత ధన్యవాదాలు చెప్పాలి.

బీఆర్‌ఎస్, బీజేపీ.. రెండూ కాంగ్రెస్ పార్టీని ఎంతగా ఎండగట్టినా పీవీ విషయం వచ్చేసరికి ఆయనను గొప్పగా గౌరవించడం గమనించదగ్గ అంశం. శత్రువులు కీర్తించి, స్వపక్షాలు విమర్శించిన ఖ్యాతి కూడా పీవీకే దక్కింది.

చివరికి మోడువారిన పీవీ వృక్షానికి, కేసీఆర్ పాదులు తీసి, ఎరువులు వేసి, నీళ్లు పెట్టి చిగురింపజేయగా.. మోదీ ఆ వృక్షానికి భారతరత్న పురస్కారంతో జీవం పోశారు. ఇంత జరిగినా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మాత్రం ముక్తసరిగా 'మేమూ స్వాగతిస్తున్నాం' అని మాత్రమే పలికింది. తొలి నాళ్ల నుంచి కాంగ్రెస్‌లోనే ఉంటూ ఎక్కడో తెలంగాణ మారుమూల పల్లె వంగరలో పుట్టిన పీవీ స్వయంకృషితో ఎదిగి బహుముఖీన ప్రతిభతో, బహుభాషా పాండిత్యంతో, స్థితప్రజ్ఞుడై భాషించారు. రచ్చ గెలిచి, ఇంట గెలిచిన పీవీ పేరిట ఆధునిక భారత చరిత్రలో నిస్సందేహంగా ఒక సువర్ణ అధ్యాయం ఉంటుంది.

(వ్యాసకర్త: రాజకీయ, సామాజిక, సాహిత్య విశ్లేషకుడు)


# విద్యా కుసుమాలు ఎందుకు రాలుతున్నాయి?

తెలంగాణలోని గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటికి మూలకారణాలను అన్వేషించడం, వాటిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవడం ఇప్పుడు అత్యంత ఆవశ్యకం. విద్యార్థుల జీవితాలతో ముడిపడిన ఈ మహమ్మారిని అంతం చేసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నడుం బిగించాల్సిన అవసరం ఉన్నది.

విద్యార్థుల ఆత్మహత్యలకు గల కారణాలను ఒకసారి విశ్లేషిస్తే.. విద్యార్థులపై అధిక ఒత్తిడి, ఆధునిక గురుకులాల్లో పోటీతత్వం, ర్యాంకుల వేట తదితర అంశాలే మనకు కనిపిస్తాయి. ఇవి విద్యార్థుల మానసిక స్థితిపై దుష్ప్రభావం చూపుతున్నాయి. అధిక మార్కులు సాధించాలనే ఒత్తిడి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అంచనాలను అందుకోలేక కొందరు విద్యార్థులు తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై చర్చించేందుకు వేదికల కొరత కూడా తీవ్రంగా ఉంది. మానసిక ఆందోళనతో బాధపడే విద్యార్థులకు తమ భావోద్వేగాలను పంచుకోవడానికి సరైన వేదిక లభించడం లేదు. అండగా నిలిచేవారు లేకపోవడంతో భయంతో వారు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గురుకులాల్లో క్రమశిక్షణ పేరిట మానసిక, శారీరక వేధింపులకు దారితీసే శిక్షా విధానాలు అమలవుతున్నాయి. సున్నితమైన మనస్తత్వాలు కలిగిన విద్యార్థులు వాటిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు లేకపోలేదు. గురుకులాల్లో చదువుకునే పిల్లలు.. తల్లిదండ్రులు, ఇంటి వాతావరణానికి దూరమవడం వల్ల ఒంటరితనానికి లోనవుతున్నారు. దీనివల్ల వారి ప్రవర్తనలో ప్రతికూల మార్పులు వచ్చి ఆత్మన్యూనత భావానికి గురవుతున్నారు.

పరీక్షలు, మార్కులపై కాకుండా విద్యార్థుల నైపుణ్యాల గుర్తింపు, వికాసాలపై విద్యా విధానాలను ప్రభుత్వం రూపొందించాలి. విమర్శనాత్మక ఆలోచన, భావోద్వేగ నియంత్రణ తదితర జీవిత నైపుణ్యాలను సిలబస్‌లో భాగం చేయాలి. తప్పనిసరిగా ప్రతి గురుకులంలో అర్హత కలిగిన కౌన్సెలర్, సైకాలజిస్టులను నియమించాలి.





కౌన్సెలర్ల సాయంతో విద్యార్థుల మానసిక సమస్యలను తీర్చేందుకు కృషి చేయాలి. సోషల్‌మీడియా, ఆన్‌లైన్‌కు విద్యార్థులు బానిసలుగా మారకుండా చూడాలి. వారిని నిరంతరం పర్యవేక్షించాలి. విద్యార్థుల మధ్య జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి. కేవలం ఆదేశాలివ్వడం, శిక్షించడం కాకుండా విద్యార్థులతో ఉపాధ్యాయులు మమేకం కావాలి. బోధనా విధానం ప్రోత్సాహక వాతావరణాన్ని కల్పించేలా ఉండాలి. ఒత్తిడికి గురిచేయకూడదు. మానసిక ఆరోగ్య సమస్యలున్న పిల్లలు కొన్ని సంకేతాలు ఇస్తుంటారు. ఉపాధ్యాయులు ఇలాంటి సంకేతాలను గుర్తించి వారిని కౌన్సెలింగ్‌కు తరలించాలి.

ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు మానసిక ఆరోగ్యానికి సంబంధించిన వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించాలి. ఎటువంటి లక్షణాలున్న పిల్లల్లో ఆత్మహత్యకు పాల్పడాలనే ఆలోచనలు కలుగుతాయో వారికి వివరించాలి. పిల్లలు ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, మానసిక సమస్యల గురించి ఉపాధ్యాయులు ఆరాతీయాలి. వారి మానసిక ఆరోగ్య స్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలి. తెలంగాణలోని గురుకులాలను చదువులకు స్వర్గసీమలుగా చెప్తారు. ఈ విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు జరగకుండా చర్యలు చేపట్టాలి. విద్యార్థులు మానసిక ఆరోగ్యంతో క్షేమంగా ఉండి, చదువుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.


- శ్రీధర్

తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి మాత్రమే ఆరు గ్యారెంటీల ఫలాలు అందుతాయని కాంగ్రెస్ సర్కార్ నిబంధనలు పెట్టడంతో ఎంతోమంది పేదలు ఆందోళన చెందుతున్నారు. అర్హులైనప్పటికీ చాలామంది సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో అందరికీ లబ్ధి చేకూరుస్తామని చెప్పి.. ఇప్పుడు మాటమార్చడం సరికాదు. ప్రజాపాలన అని చెప్పుకొంటూ ఇలా చేయడం రేవంత్‌రెడ్డి సర్కార్‌కు తగదు.

# రేషన్‌కార్డులెప్పుడు ఇస్తారు సారూ!



గుండమల్ల సతీశ్ కుమార్
94931 55522



కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మొదటినుంచి గందరగోళంగానే ఉన్నది. పాలనలో ఒక పద్ధతి అంటూ లేకుండాపోయింది. పేరుకే ప్రజాపాలన అని చెప్తున్నారు గానీ, ప్రజాపాలన కాదిది. ప్రజలు ఆందోళనలకు గురయ్యే పాలన ఇది. రేషన్‌కార్డులు ఇవ్వకుండానే గృహజ్యోతి తదితర పథకాలకు తెల్లకార్డు ఉన్నవారే అర్హులని పేర్కొనడం ఎంత వరకు సమంజసం? అధికారమే లక్ష్యంగా హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల వేళ అరకొరగా పథకాలు ఇచ్చి మరోసారి లబ్ధి పొందాలని చూస్తున్నది. కొంతమందికే ఇచ్చి అందరికీ ఇచ్చామని ప్రచారం చేసుకోవాలని భావిస్తున్నది. ప్రతి పథకానికి రేషన్‌కార్డు ప్రామాణికం అయినప్పుడు మొదటగా కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేసి ఆ తర్వాతే పథకాలను ప్రారంభించాలి కదా! లక్షల మంది లబ్ధికి దూరమవుతుంటే అది ప్రజాపాలన ఎలా అవుతుంది?

కేసీఆర్ పదేండ్ల పాలనలో కొత్తగా ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారు. పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లారు. అబద్ధాలు చెప్పి.. చెప్పి.. అదే నిజమనే భావన కలిగించారు. కానీ, వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వం సుమారు ఆరు లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసింది. అయితే ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీఆర్‌ఎస్ నాయకులు పూర్తిగా విఫలమయ్యారు. 'మేం వస్తే అందరికీ రేషన్‌కార్డులు ఇస్తాం' అని నమ్మబలికిన కాంగ్రెస్ ఆయా వర్గాల ఓట్లను కొల్లగొట్టింది. అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తుండటంతో అనేకమంది సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారు. రేషన్‌కార్డులు ఇచ్చాకే పథకాలను అమలు చేసి పేదలకు న్యాయం చేయాలి.

ప్రజాపాలన పేరిట దరఖాస్తులు తీసుకున్నప్పుడు కూడా గందరగోళం నెలకొంది. మొదట్లో రేషన్‌కార్డు ఉన్నవారు మాత్రమే దరఖాస్తులు చేయాలని చెప్పారు. ఈ నిర్ణయంపై రేషన్‌కార్డు లేని వారి నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో తెల్లకాగితాలపై 'రేషన్‌కార్డు కావాలి' అని రాసివ్వాలని చెప్పారు. ఇప్పుడు ఆ తెల్లకాగితాలు ఎక్కడు ఉన్నాయో తెలియడం లేదు.

రేషన్‌కార్డులు లేకపోయినా అర్హులైనవారికి సంక్షేమ పథకాలు అందించాలి. వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి. తెలంగాణ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఏ పథకమూ అమలయ్యే సూచనలు కనిపించడం లేదు. ఎన్నికలయ్యాక పట్టపగలే చుక్కలు చూసే రోజులు రావొచ్చు. మరోసారి మోసపోతే మనమే గోసపడతాం. అందుకే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలి.